క్లుప్తంగా

మార్కెట్ కమిటీ సభ్యులకు సన్మానం

వనపర్తిటౌన్: స్థానిక మార్కెట్ కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, సభ్యులను జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం భవనంలో ఆదివారం శాలువాలతో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడారు.. పార్టీలో పని చేసేటప్పుడు చిన్న హోదా, పెద్ద హోదా అనే వ్యత్యాసాలు చూడకుండా పని చేయాలని, ప్రజలకు దగ్గర్లో వారి సమస్యలకై పోరాడే వాడు నిజమైన నాయకుడు అని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ గట్టుయాదవ్, వైస్ చైర్మన్ శ్రీధర్, సూర్యవంశం, గిరి రెడ్డి, యుగంధర్‌రెడ్డి, శంకరమ్మ, పరంజ్యోతి, బాలకృష్ణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం

కొత్తకోట: పట్టణ సమీపంలో నిర్మించిన అయ్యప్ప మాలాధారులకు అన్నదాన సత్రానికి మండలంలోని అమడబాకుల చెందిన ఎన్ఆర్ఐ సుదర్శన్, ప్రతిమ దంపతులు రూ.51వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో అయ్యప్ప సేవాసమితి నాయకులు నాగరాజు, కిశోర్‌కుమార్, లింగేశ్వర్, అనిల్‌కుమార్, గంగాధర్‌శెట్టి, రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

బీజేవైఎం మండల కమిటీ ఎన్నిక

ఖిల్లాఘనపురం: మండల కేంద్రానికి చెందిన పురుషోత్తం బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శిగా ఎంపికయ్యారు. ఆదివారం పెద్దమందడి మండలంలోని మోజర్ల మద్దిగట్లలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన యువమోర్చా ప్రధాన కార్యదర్శులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్‌రెడ్డి ప్రకటించారని సందర్భంగా ధ్రువీకరణ పత్రాన్ని అందజేసినట్లు పురుషోత్తం తెలిపారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల తోడ్పాటు



పాన్‌గల్: నేరాల నియంత్రణ కోసం గ్రామాల్లో ఏర్పాటు చేసే సీసీ కెమెరాల ఏర్పాటుకు దాతల ఆర్థిక తోడ్పాటు అభినందనీయమని ఎస్ఐ నాగన్న అన్నారు. ఆదివారం మండలంలోని శాగాపూర్‌లో ఏర్పాటు చేసే 9 సీసీ కెమెరాలకు ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు సుబ్బయ్యయాదవ్ ఆధ్వర్యంలో రూ.1.10లక్షల చెక్కును ఆదివారం ఎస్ఐకు అందజేశారు. కార్యక్రమంలో రవికుమార్, రాముయాదవ్, జ్యోతినందన్‌రెడ్డి, వెంకటయ్య నాయుడు, రఘుపతినాయుడు, అలీమ్‌పాష, కోటయ్య, రవికుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన చెక్కులను ఆదివారం వనపర్తి క్యాంపు కార్యాలయంలో మంత్రి నిరంజన్‌రెడ్డి పంపిణీ చేశారు. మండలంలోని తాటిపాముల చెందిన జయంతికి రూ.15 వేలు, గుంటి గోపాల్ రూ.1.50లక్షలు, గుంటి వెంకటమ్మ రూ.17,500, చాకలి ఎల్లమ్మ రూ.35 వేలు, గొల్ల కురుమయ్య రూ 32,500, బీసం కొండారెడ్డికి రూ.38వేలు, ప్రశాంత్‌సాగర్ రూ.14 వేలు, చెన్నమ్మ రూ.20వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, లబ్ధిదారులు పాల్గొన్నారు.
కొత్తకోట రూరల్ (పెద్దమందడి): మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి నిరంజన్‌రెడ్డి అందజేసినట్టు సర్పంచ్ జయంతి తెలిపారు. ముందరితండాకు చెందిన మేఘావత్ గణేష్‌కు రూ.60వేలు, నేనావత్ రత్నమ్మకు రూ.9వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు.

క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో విరాళం

కందనూలు: క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ సేవా కార్యక్రమాల నిర్వాహణ కోసం క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసా రాఘవేందర్ ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడా వ్యక్తిగతంగా ఆదివారం జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు సమక్షంలో రూ.లక్షను క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర కోశాధికారి పరమేశ్వరయ్యకు అందజేశారు. కార్యక్రమంలో క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర అధ్యక్షుడు దర్శి రాజయ్య, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పోల శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ స్వామి, చంద్ర మోహన్‌రెడ్డి, రమణ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు

జడ్చర్ల: పట్టణంలో నూతన సంవత్సర వేడుకల సందర్భంగా శనివారం రాత్రి ప్రత్యేకంగా డ్రంకెన్ డ్రైవ్ నిర్వహించినట్లు సీఐ రమేశ్‌బాబు తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 20 మందిపై కేసులు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. వాహనాలను స్వాధీనం పర్చుకుని సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. ఇక నుంచి పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తరుచుగా నిర్వహిస్తామని, వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపొద్దని కోరారు.

ఉత్సాహంగా వేడుకలు

జిల్లా వ్యాప్తంగా కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ప్రజలు కేకులు కట్ చేసి, పటాసులు కాల్చి సంబరాలను నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా అర్ధ రాత్రి ఘనంగా కొత్త సంవత్సరానికి స్వాగతం పలికారు. ఆదివారం కొత్త సంవత్సరంలో ఎలాంటి కీడు కలగరాదంటూ ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అదేవిధంగా చర్చిల్లో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



అమరచింతలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



శ్రీరంగనాథలయంలో భక్తులు



ఆత్మకూర్‌లోని సాయిబాబా ఆలయంలో..



ఆత్మకూర్ చర్చిలో కేక్ కట్ చేస్తున్న క్రైస్తవులు



కొత్తకోట కోటిలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



గోపాల్‌పేట బుద్దారం గండి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు

ముగిసిన సీపీఐ ఆవిర్భావ వారోత్సవాలు

పాన్‌గల్: మండలంలో వారం రోజుల పాటు నిర్వహించిన సీపీఐ పార్టీ ఆవిర్భావ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు వెంగళాయిపల్లి ౖడపార్టీ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ, శ్రీరామ్ మాట్లాడారు. కార్మిక, కర్షక, కూలీలు, బడుగు, బలహీన వర్గాల ప్రయోజనాలు, హక్కుల సాధన కోసం పోరాడేది ఎర్రజెండా పార్టీ మాత్రమే అన్నారు. కార్యక్రమంలో హన్మంతు, బాలస్వామి, శేషయ్య, వెంకటయ్య, కత్రన్న, రామకృష్ణ, మేఘనాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఇరుకు రోడ్డును విస్తరించాలని నిరసన

మండలంలోని వెంగళాయిపల్లి సమీపంలో మలుపు వద్ద ఇరుకు రోడ్డును వెంటనే విస్తరించి ప్రమాదాలు నివారించాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. రోడ్డు విస్తరణ పనులను చేపట్టకపోవడం, ఇరుకైన మలుపులు దగ్గరికి వచ్చే వరకు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయన్నారు. కిలోమీటర్ మేరకు రోడ్డు విస్తరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, పనులను వెంటనే పూర్తి చేసి ప్రమాదాలు చోటుచేసుకోకుండా నివారించాలని వారు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు

వ్యవసాయ పరికరాలను తరలించండి



వీపనగండ్ల సమాఖ్య కార్యాలయ ఆవరణలో పడి ఉన్న పరికరాలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య కార్యాలయానికి మూడు సంవత్సరాల క్రితం రూ.20 లక్షల ఖర్చు చేసి కొనుగోలు చేసిన వ్యవసాయ పరికరాలు కార్యాలయ ఆవరణలో వృథాగా పడి ఉన్నాయి. బ్యాంకు రుణం ద్వారా కొనుగోలు చేసిన పరికరాల కొనుగోలు కోసం చెల్లించాల్సిన ప్రీమియం డబ్బులు కూడా రాకపోవడంతో మహిళా సంఘాల పొదుపు డబ్బుల నుంచి చెల్లిస్తున్నారు. మండలంలో జూరాల, భీమా, కేఎల్ఐ కాల్వలు ఉండడం వల్ల రైతులు అధిక సంఖ్యలో పంటలు సాగు చేసినా ప్రతి గ్రామంలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఉండడం వల్ల అధికారులు నిర్ణయించిన వ్యవసాయ పరికరాల కిరాయి రేట్లు అధికంగా ఉండడం వల్ల తీసుకునేందుకు ముందుకు రావడం లేదు. సమాఖ్య కార్యాలయం ముందు ఉంచిన పరికాలలో కొన్ని గతంలో అపహరించుకుని పోయిన వాటి ఆచూకీ లభించడం లేదు. ఉన్నత స్థాయి అధికారులు స్పందించి వృథాగా ఉన్న పరికరాలను ఇతర ప్రాంతాలకు తరలించి మహిళలు పొదుపు చేసుకుంటున్న డబ్బులను వాడకుండా చూడాలని మహిళా సంఘం సభ్యులు కోరుతున్నారు.

అంబులెన్స్ సర్వీసులు ప్రారంభం

కల్వకుర్తి టౌన్: ఆపద సమయాల్లో ఆర్థికంగా లేని వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ఫౌండేషన్ ముందుంటుందని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని కమ్యూనిటీ ఆస్పత్రి వద్ద ఫౌండేషన్ తరపున ఆరు ఉచిత అంబులెన్స్ సర్వీసులను ఆయన ప్రారంభించారు. చాలా మంది నిరుపేదలు మెరుగైన వైద్యం కోసం ప్రధాన పట్టణాలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను చూసి ఈ ఆలోచనకు శ్రీకారం చుట్టామని తెలిపారు. నియోజికవర్గంలోని పలు మండలాల్లో కూడా ఇలాంటి సేవలను త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అనంతరం పట్టణంలోని ఎంబీ చర్చిలో నూతన సంవత్సర వేడుకల ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్ రెడ్డి, పవన్‌కుమార్, శ్రీపతి, బాల్‌రెడ్డి, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.



అంబులెన్స్‌లను ప్రారంభిస్తున్న రాఘవేందర్ రెడ్డి

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: పశుసంవర్ధక శాఖ నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివారం స్థానికంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి మల్లేష్ ఆధ్వర్యంలో ఎన్నికను నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా బంగి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా ఉస్మాన్ పాషా, కోశాధికారి ప్రకాష్, సహాయ అధ్యక్షుడు మధు, ఉపాధ్యక్షుడిగా సత్యమ్మ, అయూబ్, మురళీమోహన్, సంయుక్త కార్యదర్శులు సుజాత, ఫరూక్, లక్ష్మి, హరిచంద్ర, ఫాతిమా, రవి కిరణ్‌లు ఎన్నికయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కార్యవర్గ సభ్యులను మల్లేష్ పూలమాల, శాలువాలతో సన్మానించారు.



నియామక పత్రాలు అందజేస్తున్న మల్లేష్

కరాటే గ్రేడింగ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



బెల్టులు పొందిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: మక్తల్ అసెంబ్లీ నియోజకవర్గం జక్లేర్‌లో ఆదివారం డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ సాలాంబిన్ ఉమర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కరాటే బెల్టు గ్రేడింగ్ పరీక్షలో మహబూబ్‌నగర్ విద్యార్థులు ప్రతిభ కనబరిచి వివిధ బెల్టులు సాధించినట్లు డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ ఇండియా జిల్లా అర్బన్ అధ్యక్షుడు, కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్ తెలిపారు. ఈ పోటీల్లో 20 మంది జిల్లా విద్యార్థులు పాల్గొనగా 10 మంది ఎల్లో బెల్టు, ఇద్దరు విద్యార్థులు గ్రీన్, ఇద్దరు ఆరెంజ్, ఒకరు బ్లూబెల్టులు పొందినట్లు తెలిపారు. బెల్టులు సాధించిన విద్యార్థులను డ్రాగన్ షోటోకాన్ కరాటే దూ ఇండియా ఫౌండర్ సాలాంబిన్ ఉమర్, చీఫ్ ఎగ్జామినర్ అమ్రేష్, కార్యదర్శి షేక్ అబ్దుల్ సలాం, హైదరాబాద్ అధ్యక్షుడు అర్భాత్, కరాటే మాస్టర్ ఎస్‌కే.మోసీన్‌లు అభినందించారు.

దుప్పట్లు పంపిణీ

కోడేరు: మండల కేంద్రంలోని సత్యసాయిబాబ ఆలయంలో నిరుపేదలకు సత్యసాయి సేవా సమితి ద్వారా 20మందికి దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సర్పంచ్ వెంకటస్వామి హాజరై పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు రాఘవేంద్రశర్మ, మట్టయ్య, యుగేందర్‌రెడ్డి, లక్ష్మిరెడ్డి పాల్గొన్నారు.

లోగో ఆవిష్కరణ



కల్వకుర్తి టౌన్: క్రియేటీవ్ యువర్ బ్లడ్ బ్యాంక్ పేరుతో యూత్‌ఫర్ సేవా సమితి సభ్యులు రూపొందించిన లోగోను వైద్యుడు దామోదర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ ప్రతిఒక్కరూ వారి ఫోన్‌లో ఏదైనా నెంబర్‌ను సేవ్ చేసే సమయంలో వారి బ్లడ్ గ్రూప్‌ను కూడా సేవ్ చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఇలా చేయటం వల్ల ఆపద సమయంలో ఎవరికైనా బ్లడ్ అవసరమైతే తొందరగా సహాయం చేసిన వారవుతారని తెలిపారు. కార్యక్రమంలో యూత్‌ఫర్ సేవా సమితి సభ్యులు సందీప్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

విజయ్ దివస్‌ను పాఠ్యాంశాల్లో చేర్చాలి



అచ్చంపేట రూరల్: బీమా కోరేగావ్ విజయ్ దివస్‌ను పాఠ్యాంశాల్లో చేర్చాలని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం, మాల మహానాడు, మాలల ఐక్యవేదిక, బహుజన, కుల సంఘాల నాయకులు కోరారు. ఆదివారం రాత్రి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో మూల భారతీయుల విజయ దినోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కొవ్వొత్తులతో ఘన నివాళ్లర్పించారు. మూల భారతీయులు 1818 జనవరి 1న బీమా కొరేగావ్ ప్రాంతంలో కేవలం 500 మంది మూల భారతీయ సైనికులు సుమారు 28వేల పేశ్వా సైన్యంతో 12గంటల పాటు ఆహారం, నీరు లేకుండా వీరోచితంగా పోరాడి ప్రత్యర్థులను మట్టబెట్టారన్నారు. ఈ యోధుల స్ఫూర్తిని మహాత్మా జ్యోతిభాపూలే మనువాదులపై పోరాటాలు చేశారని గుర్తుచేశారు. బహుజన మేధావులపై భౌతిక దాడులను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీశైలం, జీవన్‌కుమార్, వెంకటేష్, సిద్ధార్థ్, నాగరాజు, పరుశరాం, సత్యం, నీరంజన్, లక్ష్మణ్, జనార్ధన్, ప్రవీణ్ పాల్గొన్నారు.
అమ్రాబాద్: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో బీమ్ కోరేగావ్ విజయోత్సవ దినాన్ని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి బీమా కొరేగావ్ అమరులను స్మరించుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాసరయ్య, బాలకిష్టయ్య, రఘుపతిరావ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల్లో ఏర్పాట్లు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న వెంకటేశ్వర ఆలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వైకుంఠ ద్వారం ద్వారా భక్తులు వెళ్లడానికి ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామని, భక్తులు అధిక సంఖ్యలో రావాలని కోరారు.

మారోజు వీరన్నకు ఘన నివాళి

వనపర్తిటౌన్: విప్లవ పోరాట యోధుడు మారోజు వీరన్న నేటి యువతరానికి ఆదర్శమని ప్రజావాగ్గేయకారుడు రాజారామ్‌ప్రకాష్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మా రోజు వీరన్న జయంతిని టీజేఏసీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనల వీరత్వం, తెలంగాణ అస్తిత్వం కాపాడుతూ, ఉద్యమాలకు, నిరుపేద ప్రజలకు అండగా వీరన్న పోరాటం సాగిందని వెల్లడించారు. కుల సంఘాల స్థాపనకు నడుంకట్టి, అన్ని వర్గాల ప్రజల్లో చైతన్యం నింపేందుకు అలుపెరగని పోరాటాలు చేశాడని వెల్లడించారు. కార్యక్రమంలో కవి గిరిరాజా చారి, నర్సింహశర్మ, కవి ఈశ్వర్, డప్పు నాగరాజు, బాలస్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న నాయకులు

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ



ఆత్మకూరులో అన్నదానం చేస్తున్న ముస్లింలు

ఆత్మకూర్: పట్టణంలో మతసామరస్యం వెల్లువిరిసింది. పట్టణానికి చెందిన ముస్లింలు అయ్యప్ప మాలాదారులకు అన్నదానం చేసి సోదరభావాన్ని చాటుకున్నారు. పట్టణంలోని అయ్యప్పస్వామి సన్నిధానంలో ఆదివారం సిరాజ్, ఖాజాపాష, అనీస్‌అహ్మద్, లైక్‌పాష, అజ్గర్‌బేగ్ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి పడిపూజ మహోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారికి అభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం దీక్షపరులకు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అనిల్, శ్రీను, శ్రీకాంత్, రఘు, చందు, గాడిలక్ష్మణ్, హర్షగౌడ్, బాలు, నరేష్, పాండు పాల్గొన్నారు.
ఖిల్లాఘనపురం: మండలంలోని ఆగారం గ్రామంలో ఆదివారం అయ్యప్ప పడిపూజ ఆంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 18 మెట్లను అలంకరించారు. అయ్యన్న మాలాధారణ చేసిన 50 మంది ప్రత్యేక కీర్తనలు, భక్తి గీతాలు ఆలపించి పూజలు చేశారు.

మామిడి రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

వీపగనండ్ల: మండలంలోని వివిధ గ్రామాలలో దాదాపు 4 వేల ఎకరాల్లో మామిడి తోటల్లో అధిక పూతలు వస్తుండడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గత సంవత్సరం కూడా ఇలాగే పూతలు వచ్చి చివరి వరకు నిలవకపోవడం కొద్దిపాటి కాయలు వచ్చినా తామర పురుగు, బంక తెగులుతో పిందెలు రాలిపోయాయి. తోటల ప్రాథమిక దశలో అవగాహన కార్యక్రమాలతో హడావిడి చేసే ఉద్యానవన శాఖ అధికారులు పూతలు, పిందెలు వచ్చే సరైన సమయంలో క్షేత్ర స్థాయిలో తోటలను పరిశీలించకపోవడం, రైతులు వ్యక్తం చేస్తున్న సమస్యలకు సమాధానాలు ఇవ్వడం లేదు. మండలంలో ఉన్న ఉద్యానవన శాఖ అధికారి 4 మండలాలకు ఇన్‌చార్జ్‌గా నియమించడంతో జిల్లాలోనే అత్యధిక మామిడి తోటలు గలిగిన మండల రైతులకు సలహాలు ఇచ్చేవారు కరువయ్యారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అధికారులను నియమించి అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.



మామిడి తోటలకు వచ్చిన అధిక పూతలు

జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తాం

పెద్దకొత్తపల్లి: వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. కొల్లాపూర్ ప్రగతి కోసం పాదయాత్ర 25వ రోజు దేవల్‌తిరుమలాపూర్‌కు చేరుకుంది. ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం గ్రామ ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడారు. కొల్లాపూర్‌కు పారిశ్రామిక వాడ, మామిడి మార్కెట్, పెద్దకొత్తపల్లి మండల కేంద్రానికి ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం రైతుల వ్యవసాయ పొలాల వద్ద కూలీలతో కలిసి సుధాకర్‌రావు వరినాట్లు వేశారు. కార్యక్రమంలో జలాల్ శివుడు, భీమేశ్వర్‌రెడ్డి, వెంకటయ్య, నాగరాజు, లింగస్వామి, రాజు, శివ పాల్గొన్నారు.



దేవల్‌తిరుమలాపూర్‌లో కూలీలతో కలిసి వరినాట్లు వేస్తున్న ఎల్లేని సుధాకర్‌రావు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం పెద్దదిన్నెలో వెలసిన లక్ష్మీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలలో భాగంగా రెండో రోజు సుప్రభాతసేవ, ద్వారతోరణం, ధ్వజకుంభారాధనలు, కలశ స్థాపన, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్ఠ, ఆవాహిత దేవతా హోమాలు, లఘుపూర్ణాహుతి, నివేదన హారతి, తీర్థగోష్ఠి వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను వేద మంత్రాల నడుమ నిర్వహించారు. అనంతరం లక్ష్మి అనంతరం శ్రీవారి కల్యాణతంతును నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్రహం దంపతులు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలను సమర్పించారు. అంతకు ముందు ఎమ్మెల్యే దంపతులను ఆలయ సాంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో స్వాగతం పలికి శేష వస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించి ఆలయ చరిత్రను గురించి వివరించారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుజాతమ్మ, సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, నాయకులు డాక్టర్ వీఎం అజయ్, ఆలయ అర్చకులు, ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.



పట్టు వస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే దంపతులు

సమస్యల వలయంలో కేజీబీవీ



అమరచింత శివారులోని కేజీబీవీ

అమరచింత: కేజీబీవీల్లో సౌకర్యాలు లేక విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కేజీబీవీలో మొన్నటి వరకు బాత్‌రూంలకు నీటి వసతి లేక పోవడంతో ఇబ్బంది పడిన విద్యార్థులు, ప్రస్తుతం తరగతి గదుల కిటికీలకు దోమ తెరలు లేకపోవడంతో లైట్ పురుగుల దాడికి గురై దద్దుర్లు వస్తున్నాయి. పదుల సంఖ్యలోనే విద్యార్థులు పురుగుల కాటుకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇంటర్ వరకు ఇంగ్లిష్ మీడియం కొనసాగుతుండటంతో 300మేరకు విద్యార్థులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి విద్యను అభ్యసిస్తున్నారు.

చుట్టు పక్కల పంట పొలాలు..

పాఠశాలలోని తరగతి గదుల్లోకి దోమలతో పాటు లైట్ పురుగులు అధికంగా వస్తున్నాయి. చుట్టు పక్కల పొలాలు ఉండడం, ఇతర ఇళ్లు లేకపోవడంతో పొలాల్లోని కీటకాలు అన్ని రాత్రి వేళలో పాఠశాలల్లోని తరగతి గదుల్లోకి చేరుతున్నాయి. కిటికీలకు అద్దాల తలుపులు ఉండడం, అవి పగిలిపోయి ఉన్నాయి.

సీసీ కెమెరాలు లేవు..

కేజీబీవీలలో తప్పని సరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్న అధికారులు ఇక్కడ మాత్రం అలాంటివి కనిపించవు. పాఠశాల ఏర్పాటు చేసి నాలుగేళ్లు దాటుతున్నా ఎందుకు ఏర్పాటు చేయలేదని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

చర్యలు తీసుకుంటాం

అమరచింత కేజీబీవీలో విద్యార్థులు పురుగులు కాటువేస్తున్నాయని తెలియడంతో వాటి నివారణకు చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలోని కిటికీలకు దోమ తెరలు ఏర్పాటు చేయడానికి ఎంత ఖర్చు అవుతుందనే విషయాన్ని నివేదిక రూపంలో అందించాలని పాఠశాల ఎస్‌ఓకు ఆదేశించాం. పాఠశాలలో సమస్యలు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– శుభలక్ష్మి, జీసీడీఓ